


డోర్నకల్ ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్, పక్కన అభివాదం చేస్తున్న అభ్యర్థి రెడ్యానాయక్, వేదికపై మంత్రి సత్యవతి, ఎమ్మెల్సీ సిరికొండ, ఎంపీ కవిత, ఎమ్మెల్యే శంకర్‌నాయక్, జడ్పీ అధ్యక్షురాలు బిందు

# మరిపెడ జనసంద్రం..

## వేలాది మంది రాకతో బీఆర్ఎస్ సభ గులాబీమయం

- మార్మోగిన 'గులాబీల జెండలె..' పాట
- సభికులను ఉర్రూతలూగించిన ఏపూరి, జానులిరీ గానం
- ఉత్సాహంగా స్టెప్పులేసిన ప్రజాప్రతినిధుల, మహిళలు, యువత
- కారు రావాలి.. కేసీఆర్ మళ్లీ సీఎం కావాలంటూ మిన్నంటిన నినాదాలు
- డోర్నకల్ ప్రజా ఆశీర్వాద సభ విజయవంతం

నర్సింహులపేట/కురవి/దంతాలపల్లి/మరిపెడ, నవంబర్ 21 : మరిపెడలో బీఆర్ఎస్ అభ్యర్థి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు జనం పోటెత్తారు. నియోజకవర్గంలోని మరిపెడ, కురవి, డోర్నకల్, నర్సింహులపేట, దంతాలపల్లి, చిన్నగూడూరు, సీరోలు మండలాల నుంచి ప్రజలు, కార్యకర్తలు తండోపతండాలుగా తరలివచ్చారు. గులాబీ జెండాల రెపరెపలతో, దేశ్‌కీ నేత.. జై కేసీఆర్.. జై తెలంగాణ నినాదాలతో ఖమ్మం-వరంగల్ రహదారి గులాబీ వనం కాగా, పట్టణమంతా హోరెత్తింది. సభ 3:30 గంటలకు ఉండగా ఒంటి గంట నుంచే ప్రజలతో సభ ప్రాంగణం నిండిపోయింది. సీఎం కేసీఆర్‌ను చూసేందుకు, ఆయన ప్రసంగం వినేందుకు వచ్చిన జనం చేసిన కేరింతలు ఒక వైపు.. సభలో కళాకారుల ఆటాపాటలతో మహిళలు, యువకులు నృత్యాలు కట్టిపడేశాయి. 'గులాబీ జెండలే రామక.. గుర్తుల గుర్తుంచుకో రామక్క' పాటలతో సభ ఆవరణంతా మార్మోగింది. ఏపూరి సోమన్న, జానులిరీ పాటకు పదం కలుపుతూ కళాకారులతో పాటు స్టేజ్‌పై మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ మాలోత్ కవిత, యువ నేత డీఎస్ రవిచంద్ర స్టెప్పులు వేసి ఉత్సాహం నింపగా, జనం ఈలలు, కేరింతలతో ఉర్రూతలూగింది. మహిళలు, యువకులు జెండాలు ఊపుతూ.. సభాప్రాంగణంలో కూర్చున్న కుర్చీలపై నిలబడి నృత్యం చేశారు. ఏపూరి కళాబృందం పాటలతో దుమ్ము రేపింది. ఇక ముఖ్యమంతి కేసీఆర్ వేదిక పైగా చేరుకోగానే కేసీఆర్.. హ్యాట్రిక్ సీఎం అంటూ చప్పట్లు కొడుతూ అంతా స్వాగతం పలికారు. రైతుబంధు కావాలంటే రెడ్యాను గెలిపించాలని, 24గంటల కరెంట కావాలా వద్దా అని కేసీఆర్ అడిగినప్పడు కావాలంటూ ప్రజలు నినదించారు. 3గంటల కరెంట్ కావాలా? 24గంటల కరెంట్ అందించే బీఆర్ఎస్ కావాలా? అని అడుగగా ప్రజలు బీఆర్ఎస్ కావాలని కారు గుర్తుకు ఓటేస్తామని ఉత్సాహంగా బదులిచ్చారు. కాంగ్రెస్‌వాళ్లు ధరణిని తీసేసి భూమాత తెస్తామంటున్నారని అది భూమాత కాదు భూమేత అని విమర్శించినప్పడు సభికులు హర్షం వ్యక్తం చేస్తూ మద్దతు తెలిపారు. రెడ్యానాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటే తప్పక అభివృద్ధి జరుగుతుందని, ఆయన మంచి పదవిలో ఉంటారని కేసీఆర్ చెప్పడంతో కార్యకర్తలు కేరింతలు కొట్టారు. ఇలా మరిపెడలో జరిగిన డోర్నకల్ బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభ అంచనాకు మించి విజయవంతం కావడంతో నాయకులు, కార్యకర్తల్లో జోష్ నింపింది.



బంగ్లా పైకి ఎక్కి సీఎం కేసీఆర్ ప్రసంగాన్ని వీక్షిస్తున్న ప్రజలు



కళాకారులతో కలిసి నృత్యం చేస్తున్న జానులిరీ





మరిపెడలో సభకు భారీగా వచ్చిన జనం, అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్

## మూడోసారీ కేసీఆరే సీఎం

**బీఆర్ఎస్ డోర్నకల్ అభ్యర్థి, ఎమ్మెల్యే రెడ్యానాయక్**

నర్సింహులపేట, నవంబర్ 21 : 'నా రాజకీయ జీవితంలో డజన్ ముఖ్యమంత్రులను చూసిన. ఇలాంటి విజన్ ఉన్న సీఎంను ఎప్పుడూ చూడలేదు. మూడోసారీ కేసీఆరే ముఖ్యమంత్రి కాబోతున్నారు. డోర్నకల్ నియోజకవర్గంలో 15శాతం దళితులు, చాలామంది పేదవారు ఉన్నారు. వారందరికీ ఒకే విడతలో దళితబంధు ఇవ్వాలి. నియోజకవర్గానికి డిగ్రీ కళాశాల మంజూరు చేయాలి. మరిపెడలో గిరిజనుల ఆరాధ్య దైవం వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ.5 కోట్లతో, మరిపెడలో 100 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన చేశాం. డోర్నకల్‌కు 100 పడకల హాస్పిటల్ మంజూరు చేయాలి. ఎస్సారెస్పీ కాలువలకు సిమెంట్ లైన్ వేయాలి.'

# 24 గంటల కరెంటు ఉండాలంటే రెడ్యాను గెలిపించాలె

**డోర్నకల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వంద పడకల ఆసుపత్రి నిర్మిస్తాం**

**ఆయనను గెలిపిస్తే ఇంతకంటే మంచి హోదాలో ఉంటడు**

## వజ్రాయుధం లాంటి ఓటును మంచివాళ్లకేస్తే మంచి జరుగుతుంది

### లేదంటే ఐదేళ్లు ఏడ్వాల్సి వస్తది.. లంబాడా, ఆదివాసీ, కోయలను కాంగ్రెస్ పట్టించుకోలేదు

### బీఆర్ఎస్ వచ్చాకే తండాలన్నింటినీ పంచాయతీలు చేసినం.. డోర్నకల్ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

మహబూబాబాద్, నవంబర్ 21(నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ డోర్నకల్ అభ్యర్థి డీఎస్ రెడ్యానాయక్‌ను గెలిపిస్తే ఇంతకంటే మంచి హోదాలో ఉంటాడని, 24 గంటల కరెంటు, రైతుబంధు కావాలంటే రెడ్యానాయక్‌ను గెలిపించాలని సీఎం కేసీఆర్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం మరిపెడ పట్టణలో నిర్వహించిన డోర్నకల్ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో కురవి వీరభద్రస్వామిని దర్శించుకున్నానని, ఆ సమయంలో తెలంగాణ వస్తే కురవి వీరభద్రస్వామికి బంగారు కోరమీసాలు సమర్పిస్తానని మొక్కుకున్నానని, అనుకున్న విధంగా తెలంగాణ వచ్చిన తర్వాత తానే స్వయంగా వచ్చి శివరాత్రి పండుగ రోజున కురవి వీరభద్రస్వామికి బంగారు కోరమీసాలు సమర్పించానని గుర్తుచేశారు. 'ఆ తర్వాత ఆలయాన్ని 5కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసుకున్నాం. డోర్నకల్ నియోజకవర్గానికి బీఆర్ఎస్ నుంచి రెడ్యానాయక్ నిలబడ్డాడు. వేర్వేరు పార్టీల నుంచి మరికొందరు నిలబడ్డారు. నేను మీ అందరినీ కోరేది ఒక్కటే. అభ్యర్థుల గుణగణాలతో పాటు వారి వెనకున్న పార్టీల గత చరిత్ర తెలుసుకొని ఓటెయ్యాలి. వజ్రాయుధం లాంటి ఓటును మంచి వాళ్లకు వేస్తే మంచి జరుగుతుంది. లేదంటే ఐదేళ్లు ఏడ్వాల్సి వస్తుంది. డోర్నకల్ నియోజకవర్గంలో వెన్నారం కాలువ అయితదని ఎవరూ అనుకోలేదు. రెడ్యానాయక్, శంకర్‌నాయక్ ఇద్దరూ వెంటపడి పని చేయించుకున్నరు. ఖమ్మం నుంచి వస్తున్న సీతారామ, పాలమూరు ప్రాజెక్టులు పూర్తయితే రాష్ట్రంలో నాలుగు కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిస్తాం. లంబాడా, ఆదివాసీలు, కోయల గురించి దశాబ్దాలుగా ఉన్న కాంగ్రెస్ పార్టీ పట్టించుకోలేదు. మన బీఆర్ఎస్ ప్రభుత్వంలో తండాలన్నింటినీ గ్రామ పంచాయతీలుగా చేసుకున్నం. డోర్నకల్ నియోజకవర్గంలో 82 తండాలను పంచాయతీలుగా చేసుకున్నం. ప్రతి తండాలో బీటీ, సీసీరోడ్లు వేసుకున్నం. డోర్నకల్‌లో వంద పడకల ఆసుపత్రితో పాటు డిగ్రీ కాలేజీ, ఇతర మిగిలిన పనులన్నీ చేయించే బాధ్యత నాది. సీనియర్ నాయకుడైన రెడ్యానాయక్‌ను గెలిపించాలని కోరుతున్న. కారు గుర్తుకు ఓటు వేసి రెడ్యానాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి.' అని ప్రజలను కోరారు. సభలో మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎమ్మెల్యే శంకర్ నాయక్, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల నరేశ్‌రెడ్డి, జడ్పీ చైర్ పర్సన్ అంగోత్ బిందు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు, ఎంపీపీలు గుగులోత్ పద్మావతి, గుగులోత్ అరుణ, బాలు, జడ్పీటీసీలు వెంకట్‌రెడ్డి, కమలారామనాథం, శారద, మున్సిపల్ చైర్మన్లు సింధూర కుమారి, వాంకుడోత్ వీరన్న, డీఎస్ రవిచంద్ర, మహేందర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, పరకాల శ్రీనివాస్‌రెడ్డి, కేఎస్ఎన్ రెడ్డి, ముత్యం వెంకన్నగౌడ్, రామసహాయం రంగారెడ్డి, శ్రీరంగారెడ్డి, దంతాలపల్లి మహిళా అధ్యక్షురాలు గిరివాణి, ఎంపీటీసీ నాయకి, చిన్నగూడూరు మండల మహిళా అధ్యక్షురాలు నిరూప పాల్గొన్నారు.




వేదికపై జైకొడుతున్న కవిత, సత్యవతి, శంకర్‌నాయక్



గులాబీ జెండాలు చేతబట్టి నినాదాలు చేస్తున్న యువకులు



సభ దృశ్యాలను సెల్‌ఫోన్‌లో బంధిస్తున్న మహిళ



సీఎం కేసీఆర్‌ను చూసేందుకు ఉత్సాహంగా చెట్టుపైకి ఎక్కిన అభిమానులు



ఏపూరి సోమన్నతో కలిసి స్టెప్పులేస్తున్న యువనేత డీఎస్ రవిచంద్ర